క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



ఆకట్టుకున్న విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

రావికమతం : కొత్తకోట హైస్కూల్ 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. హైస్కూల్ కమిటీ చైర్మన్ అడ్డూరి నానాజీ, హెచ్ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లితండ్రులు హాజరయ్యారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని సర్పంచ్ కోన లోవరాజు, ముఖ్య నాయకులు కోరారు. అనంతరం అంతా సహ పంక్తి భోజనాలు చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎం.అలమండలో గడ్డి వాము దగ్ధం

దేవరాపల్లి : మండలంలోని ఎం. అలమండ పోతల వారి కల్లాల్లో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. సమీపంలోని విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి ఈ ప్రమాదం జరిగిందని బాధిత రైతు పోతల గోవింద్ తెలిపారు. తామంతా మంటలను అదుపు చేయగలిగినా గడ్డి వాములు పూర్తిగా దగ్ధమవ్వడంతో పశువులకు పశు గ్రాసం లేకుండా పోయిందని అతను ఆవేదన వ్యక్తం చేశారు.

5 లీటర్ల నాటుసారాతో మహిళ అరెస్టు

చీడికాడ : మండల కేంద్రం చీడికాడలో మహిళ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన నాటుసారాని స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ నారాయణరావు గురువారం రాత్రి తెలిపారు. చీడికాడ గ్రామానికి చెందిన నాగేటి కాంతమ్మ అనే మహిళ ఇంట్లో ఉంచిన 5 లీటర్ల నాటుసారాయి స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వీరనారాయణం హైస్కూలు విద్యార్థుల ప్రతిభ



విజయవాడలో డీఈవో ప్రతాపరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సైన్సు ఉపాధ్యాయురాలు సుజాత

మాడుగుల రూరల్ : ఏపీఈఎండీపీ ప్రాజెక్టు కింద రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో వీరనారాయణం హైస్కూల్ విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన బయోప్లాస్టిక్ ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి పొందారు. హైస్కూలు విద్యార్థులు జశ్వంత్, కొల్లారు సూర్యభగవాన్, శ్యామ్ శశాంక్, ఊట వంశీకృష్ణ, సలాది శ్యామ్ కర్రపెండలం దుంప పిండి, అరటి పండ్ల తొక్కలు, కూరగాయ తొక్కలతో బయోప్లాస్టిక్ ప్రాజెక్టుగా కప్పులు, ప్లేట్లు తయారు చేశారు. వీరికి విజయవాడలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రం, జ్ఞాపికలను డీఈవో ప్రతాప్‌రెడ్డి, ఉన్నత విద్యాశాఖాధికారుల చేతుల మీదుగా అందజేశారు. ప్రాజెక్టుకు సైన్సు ఉపాధ్యాయురాలు వి.సుజాత గైడ్‌గా వ్యవహరించారు. ఉపాధ్యాయినిని హెచ్ఎం జగన్నాథరావు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పెదబొడ్డేపల్లి డాన్ బాస్కో కాలేజీ, నర్సీపట్నం కొత్తవీధి, బీసీ కాలనీ, అయ్యన్న కాలనీ, కోర్టు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భోళాశంకరా.. మము బ్రోవరా

- శివరాత్రి సందర్భంగా ఆలయాలు ముస్తాబు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్న భక్తులు



ధారమఠంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నర్సీపట్నం డీఎస్పీ, రూరల్ సీఐ



కేజే పురం శివాలయంలో ఉమా భీమలింగేశ్వరస్వామి



ఎం. కోడూరులో అందంగా ముస్తాబు చేసిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం



మాడుగుల పార్థసారథి ఆలయంలో ఉత్సవాలకు సిద్ధమైన ఈశ్వర శిల్పం

మాడుగుల రూరల్ : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు ముస్తాబయ్యాయి. ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రాత్రి 9 గంటలకు సామూహిక మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చింతా వెంకటరమణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురాతన శివాలయమైన వీరవల్లి అగ్రహారం ఉమా భీమలింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, పూజలు, రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. శ్రీ పార్వతీ సహిత భీమేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. అలాగే జంపెన, వీరనారాయణం, వీజే పురం, పిట్టగెడ్డ, వంటర్లపాలెం, కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామికి, వీరవల్లి అగ్రహారం పెట్రోల్ బంకు వద్ద గల శివాలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు.

ముస్తాబైన ఆలయాలు..

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయతీ వడ్డాదిలో మూడు వందల ఏళ్ల నాటి భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు నిమ్మలోవ, పంగిడి, చిట్టియ్యపాలెం, సీతయ్యపేట, మల్లాం, దిబ్బిడి, తురకలపూడి, బంగారుమెట్ట, విజయరామరాజుపేట, గున్నెంపూడి, బుచ్చెయ్యపేట, కరక, మంగళాపురం తదితర గ్రామాల్లో గల శివాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇక్కడ ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, సమారాధనలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

చోడవరంలో..

చోడవరం : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చోడవరంలోని స్వయంభూ గౌరీశ్వరాలయం, ముద్దుర్తి శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయం ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. మత్స్యరాజుల కాలంలో నిర్మించిన స్వయంభూ గౌరీశ్వరాలయం, మూడు ప్రధాన నదులు కలిసిన చోట వెలసిన ముద్దుర్తి శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయాలు శైవభక్తులకు ప్రత్యేకమని చెప్పాలి. గౌరీపరమేశ్వరులు, అర్ధనారీశ్వరుల నిలువెత్తు విగ్రహాలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా పేర్కొంటారు. శివరాత్రి సందర్భంగా ఈ ఆలయ ప్రాంగణాల్లో అన్నమయ్య సంకీర్తన ప్రవంతి, కూచిపూడి నృత్యం, ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. జుత్తాడ గ్రామంలో సుమారు 800 సంవత్సరాల క్రితం మత్స్యరాజుల కాలం నాటి శివాలయం ఉంది. ఇక్కడి స్ఫటిక లింగం భక్తుల ప్రత్యేక పూజలందుకుంటోంది. శారదా నది ఒడ్డున ఉన్న గవరవరంలోని కాశీ విశ్వేశ్వరాలయంలో మూడు నందులు ఉండడం ప్రత్యేకం. వీటితో పాటు మండలంలోని గోవాడ, భోగాపురం, లక్ష్మీపురం, లక్కవరం, వెంకన్నపాలెం శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

మాడుగులలో..

మాడుగుల : నియోజకవర్గ కేంద్రం మాడుగులలో మహా శివరాత్రి వేడుకలకు శివాలయాలు సిద్ధమయ్యాయి. శుక్రవారం జరగనున్న ఈ వేడుకలకు ఉబ్బలింగేశ్వరస్వామి, శ్రీకృష్ణభూపాలేశ్వర స్వామి, స్వర్గలింగేశ్వర స్వామి, శివగంగ పోతురాజుబాబు ఆలయాల్లో ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ధారమఠంలో మూడు రోజుల ఉత్సవాలు..

గొలుగొండ : శివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రమైన ధారమఠం వద్ద భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. భక్తులు తాకిడి దృష్ట్యా ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నారు. ధారమఠం జలపాతాల వద్ద శివాలయం ఉండటం వల్ల ఈ ప్రాంతం ప్రత్యేకత సంతరించుకుంది. ఇక్కడ శుక్రవారం రాత్రి నుండి శనివారం అర్ధరాత్రి వరకు రుద్రాభిషేకం జరుగుతుంది. నర్సీపట్నం ఆర్టీసీ ఆధ్వర్యంలో 50 సర్వీసులు, గొలుగొండ నుండి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేశారు. ప్రైవేట్ వాహనాలను పోలీసులు అనుమతించ లేదు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇక్కడ శుక్ర, శనివారాల్లో దాదాపు 50 వేల మంది భక్తులకు అన్నసమరాధన జరగనుంది. గురువారం నర్సీపట్నం డీఎస్పీ మోహన్, రూరల్ సీఐ బి. హరి, ఎస్ఐ కృష్ణారావు ఆలయ పరిసరాలను పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన వడ్డాదిలోని శివాలయం



విద్యుద్దీపాలంకరణలో చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం



ధారమఠం శివాలయం



ధారమఠం జలపాతం (ఫైల్)

అధినేత సభకు.. అంతా ఒక్కటై..

- పిసినికాడ బహిరంగ సమావేశానికి పెద్ద ఎత్తున తరలిన పార్టీ శ్రేణులు



చౌడువాడ నుండి తరలి వెళ్తున్న మహిళలు



బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నుండి తరలి వెళ్తున్న నాయకులు



అర్జునగిరి నుంచి పిసినికాడ సభకు వెళ్తున్న మహిళలు



ఎం. అలమండ నుండి బయలుదేరి వెళ్తున్న మహిళలు



రావికమతం నుంచి తరలి వెళ్తున్న మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మాడుగుల మండలం సత్యవరం నుండి తరలి వెళ్తున్న మహిళలు



వీరవల్లి అగ్రహారం నుంచి తరలి వెళ్తున్న మహిళలు

దేవరాపల్లి : అనకాపల్లి మండలం పిసినికాడలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హాజరైన వైఎస్సార్ చేయూత బహిరంగ సమావేశానికి దేవరాపల్లి మండల వ్యాప్తంగా మహిళలు తరలివెళ్లారు. దేవరాపల్లి, ఎం. అలమండ, ఎ. కొత్తపల్లి, బోయిల కింతాడ, మామిడిపల్లి, తారువ, పెదనందిపల్లి, వేచలం, కాశీపురం, ముషిడిపల్లి తదితర గ్రామాల నుండి ఆర్టీసీ బస్సులు, కార్లు, బైక్‌లపై మహిళలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివెళ్లారు.

చీడికాడ మండలం నుంచి..

చీడికాడ : సీఎం సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు గురువారం బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. అర్జునగిరిలో సర్పంచ్ బి. రమాదేవి జెండా ఊపి ప్రారంభించారు. వరాహపురంలో మండల పార్టీ అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, అప్పలరాజు పురం నుంచి ఎంపీపీ కురచా జయమ్మ సారథ్యంలో, మిగిలిన అన్ని గ్రామాల్లో చేయూత లబ్ధిదారులు తరలి వెళ్లారు.

కె.కోటపాడు నుంచి..

కె.కోటపాడు : సీఎం జగన్ సభకు కె.కోటపాడు, చౌడువాడ, గొండుపాలెం, కె.సంతపాలెం, ఎ.కోడూరు, వారాడ తదితర గ్రామాల నుండి మహిళలు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్, సర్పంచ్‌లు వంటాకు అప్పాజీ, చల్లా మంగ, గొర్రుపోటు సౌజన్య తదితరులు వెళ్లారు.

భారీగా తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు..

మాకవరపాలెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభకు మండలం నుంచి కార్యకర్తలు, నాయకులు ఉదయం 8 గంటల నుంచే ఆటోలు, బస్సులపై పయనమయ్యారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, స్థానిక పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మహిళలు సభకు తరలివెళ్లారు.

రోలుగుంట మండలం నుంచి..

రోలుగుంట: రోలుగుంట మండలం నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభకు మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా జై జగన్ అంటూ నినాదాలు చేశారు.

రావికమతం నుంచి..

రావికమతం : సీఎం జగన్‌మోహనరెడ్డి బహిరంగ సభకు ఎంపీపీ పైల రాజు, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ తరలి వెళ్లారు.

బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నుంచి..

బుచ్చెయ్యపేట : సీఎం సభకు మండల కేంద్రం బుచ్చెయ్యపేట, మేజర్ పంచాయతీ వడ్డాది నుండే కాక 35 పంచాయతీల నుండి మహిళలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు తరలి వెళ్లారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, మాజీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు తదితరులు తరలి వెళ్లారు.

మాడుగుల మండలం నుంచి..

మాడుగుల : సీఎం జగన్ సభకు మాడుగుల మండలం నుండి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, పార్టీ మండల అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు తరలి వెళ్లారు. జగనన్న మరలా ముఖ్యమంత్రి కావాలని, సంక్షేమ పథకాలన్నీ అమలు కావాలని మహిళలు నినదించారు.

మాడుగుల రూరల్ నుంచి..

మాడుగుల రూరల్ : సీఎం జగన్ సభకు మండలంలోని వీరవల్లి అగ్రహారం, అవురువాడ తదితర ప్రాంతాల నుంచి భారీగా మహిళలు, చేయూత లబ్ధిదారులు, ముఖ్య నాయకులు ప్రత్యేక బస్సుల్లో తరలి వెళ్లారు.

అధినేతకు ఆత్మీయ స్వాగతం





వైఎస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ సందర్భంగా అనకాపల్లి మండలం పిసినికాడ విచ్చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, మాజీ డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత

'జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం'



దేవరాపల్లి సన్యాసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మ

దేవరాపల్లి : రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన సీఎం జగన్‌ను మరోసారి గెలిపించుకునేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ పిలుపునిచ్చారు. దేవరాపల్లిలో స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరితో కలిసి గ్రామ దేవత శ్రీ సన్యాసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజులు, అభిషేకాలు చేసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ లలితానాయుడు, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజులబాబు పండగ



పోతురాజులబాబుకి పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట : శరభవర గ్రామంలో గురువారం పోతురాజులబాబు పండగ ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ దోసపత్ని రాజు ఆహ్వానం మేరకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తనయుడు సూర్య వచ్చి పోతురాజులబాబుని దర్శించుకున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని, మరలా జగన్ ముఖ్యమంత్రి కావాలని, తన తండ్రి ధర్మశ్రీ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందాలని ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ దోసపత్ని వరలక్ష్మి, ఉత్సవ కమిటీ చైర్మన్ దోసపత్ని రాజు, పంచాడ చినరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సహనమూర్తి.. సేవానిరతి



మంగళాపురంలో సర్పంచ్ వెంకట పద్మరేఖను సన్మానిస్తున్న అధికారులు



కౌన్సిలర్ రత్నంను సన్మానిస్తున్న ఉపాధ్యాయినిలు

- ఘనంగా మహిళా దినోత్సవం

రేపటికి ముందడుగు

బుచ్చెయ్యపేట : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళాపురం అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ వెంకట పద్మరేఖను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ రాధ, హెచ్ఎం రామలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయలక్ష్మి సత్కరించారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఆమె సేవలను కొనియాడారు.

పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్లో..

నర్సీపట్నం: మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం లక్ష్మీబాయి ఆధ్వర్యంలో కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, ఉపాధ్యాయినిలను సన్మానించారు. ఉపాధ్యాయులు ఆట, పాటలతో సరదాగా గడిపారు. అలాగే ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లాయర్లు రామలక్ష్మి, దత్త, అరుణ, హర్షిణి, మృదుల, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజు తదితరులు పాల్గొని స్త్రీలను అంతా గౌరవించాలన్నారు.

ఉత్తమ విద్యార్థుల తల్లులు, మహిళా లెక్చరర్లకు సత్కారం..

చోడవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ విద్యార్థుల తల్లులను సత్కరించారు. పట్టణానికి చెందిన డాక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు తమ సేవా సంస్థ ద్వారా చదువుకునేందుకు సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినుల తల్లులు, మహిళా లెక్చరర్లను సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్, ఉమన్ ఎంపవర్‌మెంట్ కమిటీ కోఆర్డినేటర్ రత్నభారతి, సీనియర్ ఉపన్యాసకులు ఎస్ఎం రఫీయుద్దీన్, వి.అప్పలనాయుడు, సూర్యవతి, లక్ష్మీమంగమ్మ, డి.మాల్యాద్రి పాల్గొన్నారు.

తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో..

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, శానిటేషన్ ఆయాను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్ఎం కె.రాము, ఉపాధ్యాయులు సంతోషి, లోవరాజు పాల్గొన్నారు.



తూటిపాలలో మహిళలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు





ఎమ్మెల్యే గణేష్‌పై విమర్శలు తగదు

గొలుగొండ: జి. కొత్తూరు పంచాయతీని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఎంతో అభివృద్ధి చేశారని, ఈ విషయంలో స్థానిక టీడీపీ నేతలు విమర్శించడం తగదని ఉప సర్పంచ్ కల్లింపూడి వెంకట లోకేష్, కొత్తూరు స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ నూకరాజు తెలిపారు. సీనియర్ నాయకులు కొరుప్రోలు స్వామినాయుడు, సబ్బవరపు నాగేశ్వరరావు, పెద కన్నాలనాయుడు పాల్గొన్నారు.

ఇక నాతవరం హైస్కూల్లోనే ఇంటర్

నాతవరం: వచ్చే విద్యా సంవత్సరం నుంచి నాతవరం హైస్కూల్లోనే ఇంటర్ మొదటి సంవత్సరం కోర్సు ప్రారంభం అవుతుందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. నాతవరం హైస్కూల్లో గురువారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇంత వరకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేక విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారని ఈ ఏడాది కొత్తగా జూనియర్ కాలేజీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, సర్పంచ్ గొలగాని రాణి, హైస్కూల్ కమిటీ చైర్మన్ పైల రామలక్ష్మి, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పైల పోతురాజు, ఎంఈవో తాడి అమృత్‌కుమార్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శాంతి కుమారి, విద్యా కమిటీ మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులకు మెరుగైన వైద్యం

కె.కోటపాడు : గర్భిణుల్లో హిమోగ్లోబిన్ 9 శాతం కన్నా తక్కువ ఉంటే వారిని హైరిస్క్‌గా గుర్తించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. ఆశ డే సందర్భంగా ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. హైరిస్క్ గల గర్భిణులను ముందుగా గుర్తించి మెరుగైన వైద్యం అందిస్తే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని తెలిపారు. కిషోర బాలికలకు విద్య, సమతుల్య ఆహారంపై ఆశ కార్యకర్తలు అవగాహన పెంచుకోవాలన్నారు. సీహెచ్‌వో సింహాచలం, పీహెచ్ఎన్ కృష్ణవేణి, ఏఎన్ఎం సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయం, నాతవరం
గెజిట్ నెం. 51/2024 తేది. 09-02-2024

ఆర్.సి.నెం. 12/2024/SA — తేది. 07-03-2024

బహిరంగ వేలం నోటీసు

నాతవరం మండల ప్రజా పరిషత్ ఆధీనములో గల నాతవరం గ్రామంలో 2024-25 ఆర్థిక సం॥నకు వారపు సంత పాటను నాతవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తేది. 12-03-2024న మధ్యాహ్నం 3:00 గం॥లకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారిచే కానీ మరియు వారి అనుమతి పొందిన వారిచే బహిరంగ వేలం వేయబడును. సదరు వేలంలో పాల్గొనువారు దరావత్తుగా రూ. 20,000/-లు డి.డి. మరియు సాల్వెన్సీ రూ. 1,50,000/-లకు (2024 సంవత్సరంలో పొందియున్నది), ఈ కార్యాలయమునకు అందజేయవలెను.

వేలం పాట ప్రారంభించిన తదుపరి మధ్యలో కొత్తవారికి ప్రవేశం అనుమతించబడదు. మరియు అనివార్య పరిస్థితిలో వేలం పాట వాయిదా వేయు అధికారం ఈ క్రింది సంతకందారులకు కలదు. మరియు డి.డి.లు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, నాతవరం నందు గాని భారతీయ స్టేట్ బ్యాంకు వై.డి.పేట బ్రాంచ్ నందు గాని చెల్లుబాటు అయ్యే విధంగా దిగువ సంతకం చేసిన వారి పేరున సమర్పించవలెను. నగదు రూపంలో స్వీకరించబడవు.

మండల పరిషత్ అభివృద్ధి అధికారి
మండల ప్రజాపరిషత్, నాతవరం